క్లుప్తంగా

ఆలయ ముఖద్వారం ప్రారంభం



ముఖద్వారం ప్రారంభించిన గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులోని పురాతన లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని గ్రామస్తులు దాతల సహకారంతో ఇటీవల పునఃనిర్మించారు. గ్రామానికి చెందిన ఉప్పరి వెంకటమ్మ, కృష్ణమూర్తి కుమారులు తమవంతుగా గ్రామ ప్రధాన రహదారి పక్కన లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖద్వారం నిర్మింపజేశారు. ఈ ముఖద్వారాన్ని ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు గుప్తా ఆధ్వర్యంలో ప్రారంభించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



అయ్యప్పస్వాములకు నగదు అందజేస్తున్న దాత

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన పురాతన కోదండరామస్వామి ఆలయ అభివృద్ధి కోసం శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆర్థిక సాయం అందజేశాడు. ఆలయంలో అయ్యప్ప స్వాములు సన్నిధానం నిర్వహిస్తున్నప్పటికీ వసతులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం అయ్యప్పస్వాములు మహేశ్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన స్పందించి వసతుల కల్పన కోసం రూ.75 వేల నగదుని అయ్యప్పస్వాములకు శనివారం రాత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కొండల్, లక్ష్మీనర్సయ్య, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

కుక్కల స్వైరవిహారం



కౌడిపల్లిలో ఓ కాలనీలో వీధి కుక్కలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఊర కుక్కల స్వైర విహారం కొనసాగుతోంది. ఏ వీధిలో చూసిన కుక్కల గుంపులు కనిపిస్తున్నాయి. దీంతో గ్రామస్తుల, పిల్లలు వాటిని చూసి భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు వీధికుక్కలు జనాలను కరిచిన సంఘటనలు ఉన్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్టార్టర్ డబ్బాల చోరీ



చోరీచేసిన స్టార్టర్ విద్యుత్ పరికరాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని బోరుబావుల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు స్టార్టర్ డబ్బాలు చోరీ చేశారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పలువురు రైతులకు సంబంధించిన బోరుబావుల వద్ద స్టార్టర్ డబ్బాలు, విద్యుత్ పరికరాలు ఎత్తుకెళ్లారు. యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో స్టార్టర్ డబ్బాలు చోరీ చేయడంతో మోటార్లు నడవక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

బీరుబాటిల్‌లో పురుగులు



మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన వైన్స్ షాప్‌లో ఆదివారం బీరుబాటిల్ లో పురుగులు ఉన్నాయని గుర్తించారు. దీంతో వైన్స్ యజమానులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులకు సమాచారమిచ్చినా.. వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.

చెట్టును ఢీకొన్న కారు

మిరుదొడ్డి(దుబ్బాక): కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన మిరుదొడ్డిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. కాసులాబాద్‌కు చెందిన అడ్వకేట్ రంగబోయిన నర్సింహులు గజ్వేల్ నుంచి మిరుదొడ్డి మీదుగా కాసులాబాద్‌కు శనివారం రాత్రి బయలుదేరారు. ఈ క్రమంలో మిరుదొడ్డిలోని బొమ్మరాజు చెరువుకట్టపై నుంచి వెళ్తుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. పోలీసులు అది గమనించి గాయపడిన నర్సింహులును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

వరిసాగుకే రైతుల మొగ్గు

- నీటి వనరుల కోసం బోర్ల తవ్వకాలు
- విత్తనాలు, ఎరువులు సిద్ధం



వరిగుంతం శివారులో నారుమడి

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో నీటి వనరులు తక్కువగా ఉన్నా.. బోర్ల ద్వారా నీటి ఆధారిత పంట వరి వైపు రైతులు మొగ్గుచూపుతారు. గడిచిన వానాకాలంలో పండించిన వరికి సమానంగా యాసంగిలో సైతం అదే స్థాయిలో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని, వరి నార్లు పోసి పనుల్లో బీజీబీజీగా ఉన్నారు. మండలంలో వరి సాగు డిమాండ్ దృష్టిలో ఉంచుకున్న అధికారులు ఇప్పటికే అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు సిద్ధమయ్యారు.

బోర్లపైనే ఆధారపడి..

మండలంలో మొదట్లో వరి, చెరుకు సాగు ఎక్కువగా చేసేవారు. అందుకు ఇక్కడ నేలలు కూడా అనువుగా ఉంటాయి. నీటి వనరులు లేకున్నా.. సాగు విస్తీర్ణం పెంచడానికి రైతులు బోర్లు వేస్తున్నారు. ప్రస్తుతం 70 శాతం సాగు బోర్లపైనే ఆధారపడి కొనసాగుతోంది. సమీపంలోని నిజాం దక్కన్ షుగర్ మూతపడటంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వరి పంట వైపే మొగ్గు చూపుతూ వస్తున్నారు. ఆ మేరకు విస్తీర్ణం కూడా పెరుగుతూనే వస్తుంది. గడిచిన నాలుగేళ్లలో వరుసగా 20 వేల ఎకరాలకు పైగానే వరి పంట సాగు చేస్తున్నారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలో వ్యవసాయ అధికారుల అంచన ప్రకారం విత్తనాలను అదే స్థాయిలో అందుబాటులో ఉంచారు. ఎరువుల విషయానికి వచ్చేసరికి డీఏపీ 950 మెట్రిక్ టన్నులు, యూరియా 1,710 మెట్రిక్ టన్నులు, పొటాష్ 370 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1,050 మెట్రిక్ టన్నులు అవసరముంది. రైతు ఆగ్రోస్ సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఫర్టిలైజర్ల ద్వారా ఎరువులను అందుబాటులోకి తెస్తున్నారు.

పుట్టగొడుగుల్లా ఫర్టిలైజర్ దుకాణాలు

మండలంలో పుట్టగొడుగుల్లా ఫర్టిలైజర్ దుకాణాలు పుట్టుకొస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించి ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేసి, రైతులను అప్రమత్తం చేయాలి.



బోరు వేస్తున్న రైతు

అడ్డదిడ్డంగా ఆటోల పార్కింగ్



ఆటోల పార్కింగ్ వల్ల నిలిచిన ట్రాఫిక్

శివ్వంపేట(నర్సాపూర్): ఆటోలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తూప్రాన్- నర్సాపూర్ హైవే మండల కేంద్రం శివ్వంపేట బస్టాండ్ వద్ద ఆటోలను కొందరు డ్రైవర్లు ఇష్టరాజ్యంగా పార్కింగ్ వల్ల ఆర్టీసీ బస్సులు రోడ్డు పైనే నిలపాల్సి వస్తుంది. రోడ్డు మధ్య ప్రయాణికుల కోసం బస్సు నిలపడంతో వెనకాల వచ్చే వాహనాలు ముందుకు వెళ్లేందుకు దారి లేక ట్రాఫిక్ జామ్ అవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి ఆటోలు నిలిపేందుకు స్థలం కేటాయించి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు తొలగించాల్సిన అవసరం ఉంది. ఈ విషయం గురించి ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బస్టాండ్ వద్ద ఇష్టరాజ్యంగా ఆటోలు పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్



అల్లాదుర్గంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

అల్లాదుర్గం(మెదక్): పలువురి రైతులకు ఇప్పటి వరకు రూ.రెండు లక్షల రుణమాఫీ కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మేసం చేసిందని మండల రైతు సంఘం నాయకులు రమేశ్, సంపత్, బేతయ్య ఆరోపించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేరవెర్చలేదని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికీ పలు కారణాలతో రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రైతుబంధు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ప్రభుత్వం ప్రతీ రైతుకు ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, రైతుల ఖాతాలో రైతుబంధు డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వాలీం పాషా, శంకరయ్య, నారాయణ, విఠల్, వెంకటేశం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక



బూత్ కమిటీ నూతన సభ్యులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామం బీజేపీ నూతన బూత్ కమిటీల నియామకాన్ని ఆదివారం రాష్ట్ర నాయకుడు మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ 63వ బూత్ అధ్యక్షుడిగా గంగరాజు, సెక్రటరీగా దుర్గేశ్, మన్‌కీ బాత్ ప్రముఖ్‌గా నవీన్, వాట్సాప్ ప్రముఖ్‌గా ఆంజనేయులు, 64వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా పోచేందర్, సెక్రటరీగా సాగర్, మన్ కీ బాత్ ప్రముక్‌గా శ్రీహరి, వాట్సాప్ ప్రముక్‌గా కలీం, 65వ బూత్ అధ్యక్షుడిగా సాయి, సెక్రటరీ లక్ష్మీనారాయణ, మన్ కీ బాత్ ప్రముక్‌గా కిషోర్, వాట్సాప్ ప్రాముఖ్‌గా పురుషోత్తంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేవైఎం అధ్యక్షుడు హరీశ్‌పటేల్, నాయకులు గిరి, సాయిరాం, సాయి, సురేష్ రవి, స్వామి, రమేశ్, రవితేజ, గణేశ్, రఘుపతి పాల్గొన్నారు.

గవ్వలపల్లిలో క్షయవ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హారీశ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి పల్లె దవాఖానలో ఆదివారం క్షయవ్యాధిపై డాక్టర్ హారీశ రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వరుసగా జ్వరంతో బాధపడుతున్న వారు తెమడ పరీక్ష చేసుకోవాలని, దీని ద్వారా టీబీ ఉందా లేదా అని తెలుస్తుందన్నారు. అనారోగ్యం పాలైనవారు, శారీరకంగా, ఆరోగ్యంగా రోగనిరోధక శక్తిని కోల్పోయిన వారికి తొందరగా టీబీ వచ్చే అవకాశం ఉందన్నారు. టీబీ వచ్చినవారు కూడా ఎలాంటి ఆందోళన చెందకుండా డాక్టర్ల సలహాలతో మందులు వాడుతూ.. సరైన పౌష్టికాహారం తీసుకున్నట్లైతే ఆరోగ్యానికి మంచిదన్నారు. టీబీ ఉన్నవారికి ఉచితంగా మందులు అందించడం, రెండు నెలలకు ఒకసారి ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం మాల, ఆశావర్కర్ లావణ్య, లలిత పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



పడిపూజ చేస్తున్న అయ్యప్పస్వాములు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి రామచంద్రాచారి ఆధ్వర్యంలో వంశీస్వామి నివాసంలో నిర్వహించిన పడిపూజలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 18 పడిమెట్లకు పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు పాడిన భజనలు, కీర్తనలు అందరిని ఆకట్టుకున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రేగోడ్(మెదక్): నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పోచయ్య శనివారం హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెంట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహనాల వెంట అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో మైనర్లు వాహనాలతో పట్టుబడితే వాహనాల యజమానులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. పోలీసుల సూచనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

అయ్యప్ప మాలధారుల పాదయాత్ర



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బండపోతుగల్ గ్రామం నుంచి చిట్కుల్ శివారులోని చాముండేశ్వరి ఆలయం వరకు సుమారు 12 కిలోమీటర్లు అయ్యప్పస్వాములు పాదయాత్ర చేశారు. ఆదివారం బండపోతుగల్ అయ్యప్ప సన్నిధానం నుంచి దీక్ష తీసుకున్న పలువురు స్వాములు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు అంజి, లక్ష్మయ్య, స్వాములు బాలు, అనిల్, కుమార్, ప్రవీణ్‌గౌడ్, సిద్దూ, మణికంఠ, సతీష్, పవన్ ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న పీడీ

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన గ్రామస్థాయి సీఎం కప్ పోటీల్లో 200 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కబడ్డీలో నితిన్ టీమ్ ప్రథమ స్థానంలో నిలవగా.. బాలికల విభాగంలో అర్చన టీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఖో ఖో, వాలీబాల్ క్రీడల్లో సైతం విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పెద్ది విఠల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాస్ఫూర్తి నింపేందుకు ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమలలో ఫిజికల్ డైరెక్టర్ ఉప్పలయ్య, పంచాయతీ కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

'గ్యారంటీల పేరుతో మభ్యపెడుతున్న కాంగ్రెస్'

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల గారడీతో ప్రజలను మభ్యపెడుతోందని బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూరెడ్డిగారి విభీషణ్‌రెడ్డి విమర్శించారు. రాయపోల్‌లో ఆదివారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో బూత్ కమిటీలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన అబద్ధాల హామీలతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులను మోసంచేసి విజయోత్సవ సభలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ నాయకులు రాజాగారి రాజాగౌడ్, స్వామి, స్వామి, సుఖేందర్‌రెడ్డి తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో 42 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయాన్ని అందించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు మధు, నారాగౌడ్, ఆర్ఎస్.సంతోష్, సంగమేశ్వర్, సత్యనారాయణ, పెరుమాండ్లగౌడ్, సుభాష్‌గౌడ్, కుంట్ల రాములు, కుంట్ల శ్రీను తదితరులు ఉన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి



రాయిలాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని తునికి కేవీకేలో శిక్షణకు వచ్చిన మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు రాయిలాపూర్‌లో కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల కోసం మట్టినమూనాలు ఎలా సేకరించాలో తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఐదు ఎకరాలలోపు పొలంలో కనీసం 15 చోట్ల మట్టి పైపొర తీసేసి 15 సెంటీమీటర్ల లోతు వరకు తవ్వి మట్టిని సేకరించాలన్నారు. ఈ మట్టిని పలుమార్లు కలిసి నాలుగు భాగాలుగా విభజించి రెండు భాగాలను సేకరించాలని తెలిపారు. 500 గ్రాములు మట్టిని పరీక్షలు పంపాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం వల్ల ఎరువుల వాడకం ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు పంటమార్పిడి చేయాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. కార్యక్రమంలో మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సాయిశ్రీ, రసజ్ఞ, సాహిత్య, వైష్ణవి, ప్రజ్ఞ, అనుష పాల్గొన్నారు.

వరికొయ్యలకు నిప్పు పెడితే నష్టమే

మల్లారెడ్డి యూనివర్శిటీ వ్యవసాయ విద్యార్థులు



శీలాంపల్లిలో వరికొయ్యలు కాల్చొద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వరికొయ్యల్ని కాల్చొద్దు.. కలియ దున్నాలని, వరికొయ్యలకు నిప్పుపెడితే తీవ్ర నష్టాలు కలుగుతాయని మల్లారెడ్డి యూనివర్శిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. ఆదివారం వారు మండలంలోని శీలాంపల్లి గ్రామ రైతులు వరికొయ్యలు కాలిస్తే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొయ్యకాళ్లు కాలిస్తే, నేలకు మేలు చేసే క్రిమికీటకాలు చనిపోయి, భూసారం తగ్గడంతో పాటు, కాలుష్యం పెరుగుతుందన్నారు. విపరీతమైన వేడి కారణంగా నత్రజని, ఫాస్పరస్ తగ్గుతాయన్నారు. నేలకు పీచుపదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయన్నారు. పంటలకు అవసమయ్యే ఖనిజ లవణాలు దెబ్బతింటాయని తెలిపారు. పంటలను కాపాడే జీవులు సైతం చనిపోయే అవకాశం ఉందన్నారు. అలాకాకుండా వరికొయ్యలను కలియదున్నడం మూలంగా సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడి ఎక్కువగా వస్తుందని, నేల సారవంతంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శుభాను, సాయిప్రసన్న, రోహిత, రమ్య, అభినయ, రైతులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): గర్భగుడిలో కొలువైన చాముండేశ్వరి అమ్మవారు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్ల పోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేష్ నల్ల పోచమ్మకు పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు చేసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం



తూప్రాన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

తూప్రాన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి అందించేందుకు సర్వే పనులు ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అన్నారు. సర్వే పనులను మున్సిపల్ పరిధిలోని 4, 16 వార్డుల్లో పర్యవేక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. కానీ ప్రతి పక్షాలు తమ ఉనికిని కాపాడుకునేందుకు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, నాగులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా రహదారి



పెద్దశంకరంపేట మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రహదారులన్నీ చిత్తడిగా మారాయి. ఈ వర్షాలకు రైతులు యాసంగి పనులలో నిమగ్నమయ్యారు. దీంతో పొలాలకు వెళ్లడానికి రోడ్లు బాగా లేవని అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పెద్దశంకరంపేట(మెదక్)